

తెరపైకి..
నీటి సంఘాలు


నిర్వహణ లేకపోవడంతో వృథాగా మారిన చంద్రగఢ్ ఎత్తిపోతల పథకం

- చెరువుల పునరుద్ధరణ.. ఆయకట్టు విస్తరణ లక్ష్యంగా ఏర్పాటు
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 6,055 నోటిఫైడ్ చెరువులు
- తూములు, పాటు కాలువలు, కట్టల బలోపేతానికి అవకాశం
- మినీ ఎత్తిపోతల, డిస్ట్రిబ్యూటరీలకు కూడా సంఘాలు అవసరమే..
- శిస్తు వసూలు చేస్తే.. ఆ డబ్బుతోనే మరమ్మతులకు వెసులుబాటు
- 2014 తర్వాత సంఘాల రద్దు

మహబూబ్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత రద్దయిన సాగు నీటి సంఘాలు మళ్లీ ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రైతు సంక్షేమ కమిషన్ ప్రతిపాదనలను సమర్పించడంతో చెరువులు, కాలువలు, ఎత్తిపోతల పథకాల నిర్వహణపై ఆశలు చిగురిస్తున్నాయి. చెరువుల పునరుద్ధరణ, ఆయకట్టు విస్తరణ లక్ష్యంగా ఈ సంఘాలను ఏర్పాటు చేసేందుకు గవర్నమెంట్ నిర్ణయించుకుందని సమాచారం. 1997 ఏప్రిల్‌లో రైతుల నీటిపారుదల చట్టాలను తెచ్చి, అదే ఏడాది జూన్‌లో తొలిసారిగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో 173 డిస్ట్రిబ్యూటరీలు, 10,292 సాగునీటి సంఘాలకు అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఆ తర్వాత 2003లో మరోసారి ఎన్నికలు నిర్వహించారు. ఒక సాగునీటి సంఘం ఏర్పాటు కావాలంటే కనీసం 100 ఎకరాల ఆయకట్టు ఉండాలని నిర్దేశించారు. ఆ సంఘంలో పోటీ చేయాలన్నా, ఓటు వేయాలన్నా ఆ ఆయకట్టు పరిధిలోని రైతుగా ఉండటం, 18 ఏళ్లు నిండి ఉండటాన్ని ప్రామాణికంగా తీసుకున్నారు. 2010 తర్వాత ఈ సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించ లేదు. అలాగే 2014లో స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత నీటి సంఘాలను అప్పటి ప్రభుత్వం రద్దు చేసింది. నీటి సంఘాలు చేసే పనిని గంపగుత్తగా మిషన్ కాకతీయ పథకం కింద చేసేందుకు చెరువులను గుర్తించి, మూడు ఫేజులుగా పునరుద్ధరణ చేపట్టింది. అప్పట్లో ఈ పథకంపై చాలా విమర్శలు వచ్చాయి. అనుయాయులకు కాంట్రాక్టులు ఇవ్వడం, పనులు నాణ్యంగా చేపట్టకపోవడం, పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేయడం

(మిగతా 6లో..)

ఉమ్మడి జిల్లాలో 300 సంఘాలు

ఉమ్మడి జిల్లాలో 6,055 చెరువులను ప్రభుత్వం నోటిఫై చేసింది. అందులో 100 ఎకరాల ఆయకట్టు కంటే ఎక్కువ ఉన్న చెరువులకు నీటి సంఘాలు ఉండేవి. దాదాపు 300 పైచిలుకు సంఘాలు అప్పట్లో ఉండేవని సమాచారం. ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో భాగంగా కాలువల్లో జమ్ము తొలగింపు పనులు చేపడుతున్నప్పటికీ.. అది కొన్ని ప్రాంతాల్లో మాత్రమే జరుగుతోంది. నీటి సంఘాల ఏర్పాటు వల్ల శిస్తు వసూలు ప్రారంభమై.. స్వయంగా సంఘాల ఆధ్వర్యంలో చిన్న చిన్న మరమ్మతులు చేసుకునే వెసులుబాటు ఏర్పడనుంది. రైతుల భాగస్వామ్యం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

తగ్గేదే లే!



కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ విభాగంలో చాలాకాలంగా పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు, కొత్తగా పార్టీలో చేరిన వారి మధ్య వివాదం రేగుతోంది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ మైనారిటీ నాయకుల మధ్య ఫ్లెక్సీల ఏర్పాటులో నెలకొన్న గొడవ ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌కు చేరింది. శుక్రవారం డీసీసీ కార్యాలయానికి వచ్చిన డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డికి ఓ వర్గం ఫిర్యాదు చేసింది. ఈ ఘటనలపై ఆయన ఆంధ్రజ్యోతి ప్రశ్నలకు ఫటాఫట్‌గా చెప్పిన సమాధానం ఇలా ఉన్నది.



\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, మహబూబ్‌నగర్

పాలమూరులో ఫ్లెక్సీల వివాదం ఏంటి?

పార్టీ నియమావళి, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే ఇబ్బంది లేదు. ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు.

పాత, కొత్త నాయకుల మధ్య వివాదం ఎందుకు?

జవాబు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వార్డులు, గ్రామాల్లో పోటీతత్వం ఉన్నది. అందువల్లే కొన్ని సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

రానున్న ఎన్నికల్లో ఎవరికి ప్రాధాన్యం ఉండబోతోంది.

జవాబు : పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి, పార్టీ జెండా మోసే వారికే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించాం.

పంచాయతీ వర్కర్లకు
మంచి రోజులు

- వేతనాల కోసం నిరీక్షణకు చెక్
- ఇక నుంచి ఒకటో తేదీనే జీతాలు

6

- కార్మికుల బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించిన ప్రభుత్వం
- నారాయణపేటలో 1,027 మంది మల్టీపర్పస్ వర్కర్లు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

జిల్లా గౌరవాన్ని నిలబెట్టేలా
ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనపై కలెక్టర్ విజయేందిరబోయి
- ఈ నెల 7, 8, 9 తేదీల్లో పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌బీకేఎం ఇంటర్నేషనల్ పాఠశాలలో ప్రదర్శన
- 33 జిల్లాల నుంచి హాజరుకానున్న 2,500 మంది విద్యార్థులు, గైడ్ టీచర్లు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించేందుకు అవకాశం లభించిందని, జిల్లా గౌరవాన్ని ఇనుమడింపజేసేలా ఏర్పాట్లు చేయాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇన్‌స్పైర్ రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కమిటీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన అవకాశం అభించిందన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొంటున్నందున ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వసతి, రవాణా, పార్కింగ్ వంటి ప్రధానమైన విషయాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. జడ్చర్లలోని పోలేపల్లి సెజ్‌లో గల ఎస్‌బీకేఎం ఇంటర్నేషనల్ పాఠశాలలో ఈ నెల ఏడు, ఎనిమిది, తొమ్మిది తేదీలలో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఉంటుందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో ప్రణాళికగా ఏర్పాట్లు చేయాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణ కోసం 25 కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీల్లో వివిధ శాఖల అధికారులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. 33 జిల్లాల నుంచి 2,500 మంది విద్యార్థులు, గైడ్ టీచర్లు ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా పేరును గుర్తించుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాసంగి సాగు
షురూ

7

- వనపర్తి జిల్లాలో జోరందుకున్న వరి నాట్లు
- కూలీలకు రెండు నెలల పాటు ఉపాధి


మడుల్లో నారు మోస్తున్న రైతు

కరిగెటలో పడి
కూలీ మృతి

7

కాంగ్రెస్ పార్టీనే శ్రీరామరక్ష

- రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన బీఆర్ఎస్
- అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం
- మంత్రి జూపల్లి కృష్ణారావు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి

దేవరకద్ర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశానికి, రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ శ్రీరామ రక్ష అని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకద్ర మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే జీఎంఆర్ అధ్యక్షతన వ్యవసాయ మార్కెట్ కమిటీ, వీరప్పయ్య దేవస్థాన కమిటీ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కతలప్ప, 12 మంది డైరెక్టర్లు, వీరప్పయ్య దేవస్థాన కమిటీ చైర్మన్‌గా నరసింహారెడ్డిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో అభివృద్ధి చేయకుండా కమీషన్లకు పరిమితం అయ్యిందన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రెండేళ్లలో పూర్తి చేస్తామని, సాగు నీరు ఇస్తామని చెప్పగా చుక్క నీరు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. బీఆర్ఎస్ చేసిన అప్పులను తీర్చుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. మన పాలమూరు బిడ్డ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేశారన్నారు. సంక్రాంతి తరువాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేయనున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కోటి అమలు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులుగా పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. మీరు మమ్మల్ని ఎలా గెలిపించుకున్నారో.. మేము కూడా మీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. ప్రజలు ప్రతిపక్షాల మాటలను నమ్మొద్దన్నారు. ప్రతీ ఒక్కరికి పథకాలను అందిస్తామని చెప్పారు. అంతకుముం దు ఎమ్మెల్యేలు జీ మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హ యాంలో కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఫారుక్‌అలీ, వివిధ మండలాల పార్టీల అధ్యక్షులు, డైరెక్టర్‌లు, మండల నాయకులు లక్ష్మికాంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాం పండు, నర్వశ్రీను, రాజు, బారతమ్మ, రంగయ్య, కోనరాజశేఖర్, గోపాల్, గోవర్ధన్, ప్రేమ్‌కుమార్, కొండ శ్రీను, బాల్‌రాజు, నరసింహ పాల్గొన్నారు.

విద్యార్థులు
నోబెల్ స్థాయికి ఎదగాలి

- నారాయణపేట డీఈవో గోవిందరాజులు
- జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ ప్రారంభం


మాట్లాడుతున్న డీఈవో గోవిందరాజులు

నారాయణపేట టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థులు నోబెల్ స్థాయికి ఎదగాలని నారాయణపేట డీఈవో గోవిందరాజులు అన్నారు. జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ శాస్త్రీయ పరిజ్ఞానం ప్రతీ విద్యార్థికి అవసరమన్నారు. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ పరిజ్ఞానంలో మెళకువలను నేర్చుకోవాలన్నారు. కొత్త కొత్త విషయాలు కనుక్కోవడం వల్ల శాస్త్రీయ పరిజ్ఞానం సాధ్యమైతుందన్నారు. సైన్స్ వలన జీవితంలో చాలా విషయాలు నేర్చుకుంటారన్నారు. విద్యార్థులు గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, జడ్పీ సీఈవో భాగ్యలక్ష్మీ, డీఆర్‌డీవో మొగులప్ప, డీపీవో కృష్ణ, కాంగ్రెస్ నాయకులు గందె చంద్రకాంత్, బండి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నారాయణపేట: జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో భాగంగా చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాత్రి నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వీటిని విద్యార్థులతో పాటు పట్టణ ప్రజలు తిలకించారు.






సంక్రాంతికి అదనపు బస్సులు

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 320 సర్వీసులు..

● ఈ నెల 8 నుంచి 13 వరకు నడుపుతామన్న ఆర్ఎం

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా 10 డిపోల నుంచి హైదరాబాద్‌కు 320 అదనపు బస్సులను నడపనున్నట్లు ఆర్.ఎం. సంతోష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి 13వ తేదీ వరకు బస్సులు నడుపుతామని చెప్పారు. అచ్చంపేట డిపో నుంచి 32 బస్సులను అదనంగా నడపనున్నట్లు తెలిపారు. గద్వాల డిపో నుంచి 35, కల్వకుర్తి నుంచి 32, కొల్లాపూర్ నుంచి 31, కోస్గి నుంచి మూడు, మహబూబ్‌నగర్ నుంచి 42, నాగర్‌కర్నూల్ నుంచి 32, నారాయణపేట డిపో నుంచి 33, షాద్‌నగర్ నుంచి 40, వనపర్తి నుంచి 40 బస్సులను నడుపుతామని తెలిపారు. పండుగ వేళల్లో ప్రైవేటు, అనధికార(తెల్ల నెంబర్ ప్లేట్) వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకొని వారి భద్రతతో చెలగాటం ఆడుతున్నారని చెప్పారు. ప్రయాణికులు జాగ్రత్త వహించి, వాటిలో కాకుండా సురక్షితమైన ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు.

తెరపైకి నీటి సంఘాలు



రైతుల భాగస్వామ్యంతో నిర్వహణలో ఉన్న అమరచింత ఎత్తిపోతల పథకం

(మొదటి పేజీ తరువాయి)

వంటి విమర్శలు వచ్చాయి. అయినా అప్పటి ప్రభుత్వం మూడు విడతలుగా కార్యక్రమాన్ని నిర్వహించింది. అంతచేసినా ఉమ్మడి జిల్లాల్లోని చెరువుల పునురుద్ధరణ పూర్తి స్థాయిలో కాలేదు. ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి వనరుల లభ్యత క్రమంగా పెరగడంతో ఫీడర్ ఛానళ్ల, డిస్ట్రిబ్యూటరీలు సరిగా లేకుండానే గొలసుకట్టు చెరువుల ద్వారా ఆయకట్టుకు నీరందిస్తూ వస్తున్నారు. ఏటా వర్షాకాలంలో డిస్ట్రిబ్యూటరీలకు గండ్లు పడటం, కాలువల్లో జమ్ము పేరుకుపోవడంతో నిర్వహణ సరిగా లేక ఆయకట్టు విస్తరణ జరగడం లేదు.

గతంలో పనితీరు ఇలా..

ఆయా చెరువులు, డిస్ట్రిబ్యూటరీల పరిధిలో ఉండే రైతులు ఓటు వేసి, సాగునీటి సంఘాలను ఎన్నుకునేవారు. అలా ఎన్నుకున్న సంఘాలు చిన్ననీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో పనిచేసేవి. ఆ ఆయకట్టు పరిధిలో ఉండే రైతుల నుంచి ప్రతీ పంటకు రూ.150 నుంచి రూ.200 వరకు శిస్తు రూపంలో వసూలు చేసేవారు. అలా వచ్చిన డబ్బుతోపాటు ప్రభుత్వం ద్వారా చిన్ననీటిపారుదల శాఖ నుంచి విడుదలయ్యే డబ్బులతో చెరువులు, కాలువలు, డిస్ట్రిబ్యూటరీల మరమ్మతు చేయించేవారు. అయితే స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత చిన్న నీటిపారుదల శాఖను విలీనం చేయడంతో నీటిపారుదల శాఖ ఒక్కటే అయ్యింది. అలాగే నీటి సంఘాల రద్దుతో శిస్తు వసూలు లేక.. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాక చెరువుల నిర్వహణ మృగ్యమైంది. డిస్ట్రిబ్యూటరీలు, ప్రధాన కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నా, పనులు నాసిరకంగా చేపడుతున్నారు. రైతుల భాగస్వామ్యం దూరం కావడంతో పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడు. మిషన్ కాకతీయ మూడు ఫేజుల తర్వాత ప్రభుత్వం చెరువుల మరమ్మతులను వదిలేసింది.

రైతులందరి భాగస్వామ్యంతో ముందుకు



మేము, రైతులంతా కలిసి అమరచింత చిన్ననీటి ఎత్తిపోతల పథకాన్ని ఏళ్లుగా విజయవంతంగా నడుపుకుంటున్నాం. ప్రభుత్వ సహకారంతోపాటు మా సంఘం ముందుండి మరమ్మతులు, చిన్న చిన్న ఇబ్బందులు ఉంటే పరిష్కరించుకుంటాం. పంట సాగులో లిఫ్ట్ ఆయకట్టు కింద మంచి ఫలితాలు వస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలోనే మాది ఆదర్శ లిఫ్టు. నీటి సంఘాలు ఉండి, రైతుల భాగస్వామ్యంతో అవి నడిస్తే చాలా ప్రయోజనాలు ఉంటాయి. రైతులు కూడా ఏకతాటిపైకి వస్తారు.

- చిన్న ఆంజనేయులు, అమరచింత లిఫ్టు కార్యదర్శి

ఎత్తిపోతలు, ప్రధాన ప్రాజెక్టులకూ అవసరమే..

గతంలో సాగునీటి సంఘాలు.. కేవలం చెరువులకే కాకుండా ప్రధాన ప్రాజెక్టుల డిస్ట్రిబ్యూటరీలు, కాలువలు, చిన్ననీటి ఎత్తిపోతల పథకాలకు కూడా ఉండేవి. వీటి వల్ల ఆయా పథకాల నిర్వహణ సక్రమంగా జరిగేది. ఇప్పటికీ రైతుల భాగస్వామ్యంతో అమరచింత ఎత్తిపోతల పథకం, కురుమూర్తిరాయ ఎత్తిపోతల పథకం వంటివి విజయవంతంగా నడుస్తున్నాయి. గుంటిపల్లి, చంద్రఘడ్, బెక్కెం, చెల్లెపాడు వంటి ఎన్నో ఎత్తిపోతల పథకాల నిర్వహణ ఆగిపోయింది. మోటార్లు మాయం కావడం, సామగ్రి చోరీ కావడంతో ఈ పరిస్థితి దాపురించింది. అలాగే జూరాల డిస్ట్రిబ్యూటరీలు, కోయిల్‌సాగర్ డిస్ట్రిబ్యూరీలకు కూడా గతంలో ఎన్నికలు జరిగేవి. స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత నెట్టెంపాడు, రాజీవ్ భీమా రెండు దశలు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటి లభ్యత పెరిగింది. చెరువులను నింపుతూ వాటి ఆయకట్టుకు నీరందిస్తున్నారు. కానీ, సాగునీటి సంఘాలు లేకపోవడంతో నీరు వృథా ఎక్కువ కావడం, పాటు కాలువలు సరిగా లేకపోవడం, కాలక్రమేణ తుడిచిపెట్టుకుపోవడంతో ఇప్పటికీ మోటార్ల ద్వారానే రైతులు నీటిని పొలాలకు మళ్లిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాలను పునరుద్ధరిస్తే.. చెరువులతోపాటు మినీ ఎత్తిపోతల పథకాలు, ప్రాజెక్టుల కాలువలు, డిస్ట్రిబ్యూటరీలకు కూడా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. అలాగే ప్రభుత్వం రానున్న స్థానిక సంస్థల్లో సర్దుబాటు చేయలేకపోయిన నాయకులను ఈ నీటి సంఘాల అధ్యక్షులుగా నియమించుకునే అవకాశమూ ఏర్పడుతుంది.

పంచాయతీ వర్కర్లకు మంచి రోజులు

గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్స్(పంచాయతీ కార్మికులు) వేతనాల సమస్యకు త్వరలో చెక్ పడనుంది. జీతాల కోసం నెలల తరబడి వేచి చుడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం కొత్త విధానాన్ని తెచ్చింది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే వారికి సైతం బ్యాంకుల్లోనే నేరుగా జీతాలు వేయాలని నిర్ణయించింది. అందుకు సంబంధించి జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ నుంచి అదేశాలు జారీ అయ్యాయి. దాంతో జిల్లాల్లో పని చేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్ల వివరాలను, బ్యాంకు ఖాతా నంబర్ ప్రభుత్వానికి పంపించారు.

- నారాయణపేట, ఆంధ్రజ్యోతి

● వేతనాల నిరీక్షణ కోసం ఇక చెక్

● ఇక నుంచి ఒకటో తేదీన జీతాలు

● నారాయణపేట జిల్లాలో 280 గ్రామ పంచాయతీలు, 1,027 మంది మల్టీపర్పస్ వర్కర్లు

● కార్మికులకు కలిసిరానున్న కొత్త సంవత్సరం



నారాయణపేట మండలం కోటకొండలో డ్రైనేజీని శుభ్రం చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్స్

గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్స్ కార్మికుల వేతనాల ఇబ్బందులు తీరనున్నాయి. ఇదివరకు పంచాయతీ కార్మికులకు పంచాయతీల్లో ఉండే జనరల్ ఫండ్స్ లేదా ఆర్థిక సంఘం నిధుల ద్వారా వేతనాలు ఇస్తూ వస్తున్నారు. నిధుల లేమి పేరుతో సర్పంచులు, కార్యదర్శులు కార్మికులకు వేతనాలు చెల్లించడంలో కాలయాపన చేస్తున్నారు. పంచాయతీ నిధుల నుంచి వేతనాలు ఇవ్వాలన్న నిబంధన ఉండటంతో ప్రభుత్వం కూడా పెద్దగా పటించుకునేది కాదు. అధికారులు ఒత్తిడి తెస్తే పంచాయతీల్లో నిధులు లేవని కార్యదర్శులు చెప్పుకొచ్చేవారు. గ్రామాల్లో నిత్యం పారిశుధ్య సేవలు అందిస్తున్నా, నెల నెల వేతనం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ నిధులు ఉంటేనే వేతనాలు అందే పరిస్థితి నెలకొంది.

రూ.9,500 నెలసరి వేతనం

2019 నుంచి అప్పటి ప్రభుత్వం జీవో 51 ద్వారా పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్‌కు నెల వేతనం రూ.8,500 ఇచ్చింది. గత ఏడాది మేలో కార్మిక దినోత్సవం కానుకగా రూ.1,000 పెంచడంతో రూ.9,500లకు పెరిగింది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 280 గ్రామ పంచాయతీలు ఉండగా, 1,027 మంది మల్టీ పర్పస్ కార్మికులు పని చేస్తున్నారు. సఫాయి కార్మికులు, ఎలక్ట్రీషియన్, వాటర్ మెన్స్, కారోబార్స్ అందరిని కలిపి ఎంపీడబ్ల్యూ మల్టీ పర్పస్ వర్కర్స్‌గా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పరిగణించింది.

ఇక నుంచి ఒకటో తేదీన జీతాలు

ఇక నుంచి కార్మికులకు వేతన ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రతీ నెల ఒకటో తేదీన జీతాలు అందనున్నాయి. అందుకోసం ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. జిల్లా పంచాయతీ అధికారి ద్వారా పంచాయతీ రాజ్ కమిషనర్‌కు కార్మికుల వివరాలు పంపించారు. ఎంపీవోలు వివరాలు ట్రెజరీకి పంపించడంతో ప్రభుత్వం కార్మికుల ఖాతాల్లో జీతాలు వేసేందుకు సిద్ధమౌతుంది. ఫిబ్రవరి ఒకటిన జనవరి వేతనం కార్మికుల ఖాతాల్లో వేసేలా చర్యలు తీసుకోనున్నారు.

కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి



ప్రభుత్వం గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులకు ప్రతీ నెల రూ.18 వేలు వేతనం ఇవ్వాలి. జీవో 51ని సవరించి రెగ్యులరైజ్ చేయాలి. పని ఒత్తిడి తగ్గించి, భీమా సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ట్రెజరీ నుంచి ఒకటో తేదీన వేతనాలు వేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. పంచాయతీ నిధులకు లింక్ పెట్టకుండా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలి. దామరగిద్ద మండలంలో ఆరు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

- చంద్రశేఖర్, పంచాయతీ మల్టీ పర్పస్‌వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, దామరగిద్ద మండలం

మైసమ్మ ఆలయ ఉత్సవాలు ప్రారంభం

నవాబ్‌పేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. ఆలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ చైర్మన్లు పాశం గోపాల్, కృష్ణయ్య, వేణుచారి, డైరెక్టర్ మల్లేష్ కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. అనంతరం గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో మైనుద్దీన్, పాశం నరేందర్, మురుగని మాధవులు పాల్గొన్నారు.

ఆలయాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో

మైసమ్మ ఆలయాన్ని డీఎంహెచ్‌వో కృష్ణ సందర్శించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసిన ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.



పర్వతాపూర్ మైసమ్మ ఉత్సవాల్లో భాగంగా పట్టు వస్త్రాలతో వస్తున్న చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, గ్రామస్థులు

యువ పోలీసులుగా.. వృత్తికి వన్నె తేవాలి

» ఐజీ సత్యనారాయణ

» బెటాలియన్‌లో పాసింగ్ అవుట్ పరేడ్



అధికారులకు గౌరవ వందనం చేస్తున్న ట్రైనీ పోలీసులు

ఎర్రవల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం సాధించిన యువ పోలీసులు వృత్తికి వన్నె తెచ్చే విధంగా విధులు నిర్వహించి రాష్ట్ర పోలీసు శాఖకు, తమ తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజీ) సత్యనారాయణ అన్నారు. పోలీస్ కొలువు సాధించి తొమ్మిది నెలల పాటు నిష్ణాతులై శిక్షణలో రాటుదేలి విధుల్లో చేరేందుకు సన్నద్ధమైన అభ్యర్థుల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి రాష్ట్ర ఐజీతో పాటు గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు, బెటాలియన్ కమాండెంట్ సాంబయ్యలు హాజరయ్యారు. పీవోపీలో పాల్గొని ట్రైనీ పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. 522 మంది అభ్యర్థులు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని వివిధ ప్రాంతాల్లో విధుల్లోకి వెళ్లే కానిస్టేబుళ్లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ సమాజంలోని ప్రజలకు సేవలందించే అవకాశం ఉండే డిపార్ట్‌మెంట్‌లో లక్ష్యంతో ఉద్యోగం సాధించారని, అంతే స్థాయిలో అంకితభావంతో, నిబద్ధతో విధులు నిర్వహించి రాష్ట్ర పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. సమాజంలో ప్రజల భద్రత మన శాఖ చేతుల్లోనే ఉంది కాబట్టి జరుగుతున్న సవాళ్లకు అనుగుణంగా విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. కనిపెంచిన తల్లిదండ్రులు గర్వపడేలా వ్యవహరించాలన్నారు. ఉద్యోగం వచ్చాక చాలామంది చెడు వ్యసనాలకు అలవాటు పడి లేనిపోని వ్యామోహాల్లో జీవితాలను నాశనం చేసుకున్నారని, వివాదాల్లో ఇరుక్కోకుండా మంచి పోలీస్ అధికారిగా రాణించాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న మెలకువలను, విన్యాసాలను ప్రదర్శించిన ట్రైనీ పోలీసులు పరేడ్ గ్రౌండ్‌లో ఆకట్టుకుంది. ఉద్యోగం సాధించి విధుల్లో చేరుతున్న తల్లిదండ్రులు తమ పిల్లలను హత్తుకుని బావోద్వేగానికి గురైన సంఘటన పరేడ్ మైదానంలో కనిపించింది. ముందుగా కమాండెంట్ సాంబయ్య ఐజీ సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. 2025 సంవత్సరంలో సేవా పతకాలకు ఎంపికైన పోలీసులకు ఐజీ చేతుల మీదుగా మెమోంటోలు అందించారు.

కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ జయరాజ్, అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు, పాణి, నరేందర్‌రెడ్డి, ఆర్ఐలు వెంకటేశ్వర రావు, రాజారావు, రమేష్, మాజీ సర్పంచ్ జోగుల రవి పాల్గొన్నారు.

కళాశాలలో ఉత్తీర్ణతా శాతం పెంచాలి

- ఇంటర్మీడియట్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి

అలంపూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని ఇంటర్మీడియట్ డిప్యూటీ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్ ఎం.లక్ష్మారెడ్డి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల తనిఖీలో భాగంగా శుక్రవారం అలంపూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. అనంతరం కళాశాలలోని అకాడమిక్ రికార్డులను తనిఖీ చేసి ప్రిన్సిపాల్, అధ్యాపకులతో రివ్యూ నిర్వహించి కళాశాలలోని గ్రూప్ వైజ్‌గా విద్యార్థుల సంఖ్యను, లాంగ్ ఆబ్సెంట్, డ్రాప్ అవుట్ విద్యార్థుల వివరాలను తెలుసుకొని వారిని కళాశాలకు రప్పించడానికి తీసుకోవాల్సిన చర్యలను, సలహాలు, సూచనలు ఇచ్చారు. కమిషనర్ ఆదేశానుసారం 90 రోజుల యాక్షన్ ప్లాన్‌ను క్రమం తప్పకుండా పాటించాలని, ఈ విధంగా చేయడం వలన కళాశాల ఉత్తీర్ణత శాతం పెరిగి ప్రభుత్వ కళాశాల అడ్మిషన్లు పెరుగుతాయని అన్నారు. గద్వాల జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి ఎం.హృదయరాజు, కళాశాల ప్రిన్సిపాల్ కె. పద్మావతి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

90రోజుల ప్రణాళికను విధిగా పాటించాలి

గద్వాల టౌన్ (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ఇచ్చిన 90రోజుల కార్యాచరణ ప్రణాళికను అధ్యాపకులు, విద్యార్థులు విధిగా పాటించాలని బోర్డు డిప్యూటీవ్ డైరెక్టర్, యాక్షన్ ప్లాన్ స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలను లక్ష్మారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులతో ప్రత్యేకంగా ఆయన సమావేశమయ్యారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి హృదయరాజు, అధ్యాపకులు ఉన్నారు.



విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇస్తున్న స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి

ఐటీడీఏలో వైద్యాధికారి పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా మన్ననూరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలో మాతా, శిశు ఆరోగ్యం, ఎపిడమిక్ బృందంతో కలిసి చెంచుల ఆరోగ్య సంరక్షణ కోసం పని చేసేందుకు వైద్య విద్య పూర్తి చేసిన వైద్యాధికారి పోస్టును కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రోహిత్ గోపిడి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సులను పూర్తి చేసి మెడికల్ బోర్డులో సర్టిఫికెట్ నమోదు చేసుకున్న వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు స్థానిక మండల వాసులు, లేదా జిల్లాకు చెందిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. వీరికి గౌరవ వేతనం నెలకు రూ.52,000 ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో విద్యార్హత, ధ్రువీకరణ పత్రాలను జత చేసి దరఖాస్తులను అందజేయాలని కోరారు.

వెట్టి చాకిరి సహించేది లేదు

» నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయాధికారి రాజేష్ బాబు

అచ్చంపేటటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చెంచుల చేత వెట్టి చాకిరి చేయించుకుంటే సహించేది లేదని నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయాధికారి రాజేష్ బాబు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధి లోని గుప్పన్‌పల్లి గ్రామానికి చెందిన చెంచు దంపతులు బల్మూరు మండల పరిధిలోని చెంచుపలుగుతండాకు చెందిన భూమి యజమాని గత మూడు సంవత్సరాల క్రితం రూ.15వేలు ఇచ్చి తన వ్యవసాయ పొలంలో వెట్టి చాకిరి చేయించుకుంటున్న విషయాన్ని స్వచ్ఛంద సంస్థ ద్వారా హైకోర్టుకు వెళ్లడంతో వారిని నవంబరు 14న విడుదల చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణ చేయడం జరిగింది. వారికి ఆర్థిక సహాయంగా దంపతులకు ప్రభుత్వం నుంచి వచ్చిన చెరో రూ.30 వేల చెక్కులను జిల్లా న్యాయాధికారి రాజేష్‌బాబు, జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి సబిత, అచ్చంపేట సివిల్ న్యాయాధికారి విజయ్ కుమార్, డీఎస్పీ శ్రీనివాసులు సమక్షంలో ఆర్డీవో మాధవి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రితం కూలీ పనుల కోసం వెళ్లిన దంపతులకు రూ.15వేలు ఇచ్చి అప్పటి నుంచి డబ్బులు ఇవ్వకుండా కనీసం భోజనం సదుపాయం కల్పించకుండా వెట్టి చాకిరి చేయించుకోవడం దారుణమని, ఇలాంటివి ఎవరూ ప్రోత్సహించకూడదన్నారు. ఇట్టి విషయంపై హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులతో కలిసి విచారణ చేసినట్లు తెలిపారు. అధికారుల విచారణలో చెంచు దంపతులు చేత యజమాని వెట్టి చాకిరి చేయించుకోవడమే కాకుండా తమ పిల్లల అనారోగ్యం బారిన పడ్డా పట్టించుకోకపోవడంతో చనిపోయారని, అట్టి విషయాలు త్వరలో విచారణలో బయటపడుతాయన్నారు.

యజమానిపై కేసు నమోదు చేశామని, కేసు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెంచులతో పనులు చేయించుకుంటున్న వారికి సహాయం అందించేందుకు అండగా నిలువాలన్నారు. లేబర్ ఆఫీసర్, సీఐ రవీందర్, ఎస్సై రమేష్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప శరణు ఘోష



అమరచింతలో మంగళ వాయిద్యాల మధ్య శోభాయాత్ర

● అమరచింతలో మహా పడిపూజ

అమరచింత, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప స్వామి శరణు ఘోషతో అమరచింత పులకరించింది. శుక్రవారం అమరచింత అయ్యప్ప స్వామి మహా పడిపూజ అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధల మధ్య కొనసాగింది. ఉదయం అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి అయ్యప్ప పల్లకితో పాటు పూర్ణ కలశం, స్వామి వారి ఉత్సవ విగ్రహం, స్వామి వారి ఆభరణాలతో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి కుంకుమార్చన, స్వామి వారికి అభిషేకం, 216 కలశాలతో స్వామి వారికి కలాశాభిషేకం, అన్నదాన వితరణ చేశారు. ఉదయం గణపతి, నవగ్రహ హోమాలు, నిత్యాభిషేకం, సహస్రనామార్చణలు, రాత్రి పంచామృతాల అభిషేకం, మహా మంగళ హారతి నిర్వహించారు.

మహా పడిపూజ మదనాపురం జోషి గోపాలకృష్ణ గురుస్వామి, మాకం నరసింహులు గురుస్వామి, దిపేస్ మిశ్రా ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది.

సిజేరియన్ ప్రసవాల సంఖ్య తగ్గించాలి

● డీఎంహెచ్‌వో శ్రీనివాసులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సిజేరియన్ ప్రసవాల సంఖ్య తగ్గించి సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో సమావే శమై ఆరోగ్య కార్యక్రమాల అమలు, పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పరిధిలోని గర్భవతుల సంఖ్య నమోదు వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు రామచంద్రారావు, ఝాన్సీ, సాయినాథ్‌రెడ్డి, పరిమల, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ శ్రీని వాస్ కొండ, మహేశ్వరా చారి, నర్సింగరావు, జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ నార్యనాయక్, జిల్లా డాటా మేనేజర్ వెంకట్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భూ నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

» డీఎల్ఐ కాలువ భూములను పరిశీలించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

» తమ భూములను కాపాడాలని ఎమ్మెల్యేను కోరిన నిర్వాసితులు

చారకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కమాల్‌పూర్ పంచాయతీ పరిధిలోని నూకలచింతవాడిక తండాలో డిండి లిఫ్ట్ ఇరిగేషన్ (డీఎల్ఐ) కాలువ నిర్మాణం కోసం సేకరించిన భూములను శుక్రవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పరిశీలించారు. డీఎల్ఐ కాలువలో భూములు కోల్పోతున్న నిర్వాసితులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నూకలచింత వాడిక తండాలో డీఎల్ఐ కాలువ కోసం 42 ఎకరాలు అవసరం ఉంటుందని తెలిపారు. పరిహారం విషయమై ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఇచ్చిన ఎకరాకు రూ. 5.50 లక్షల పరిహారం కంటే ఎక్కువగావచ్చే విధంగా, మన ప్రాంత బిడ్డ అయిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని భూనిర్వాసితులకు హామీ ఇచ్చారు. మాకు ఉన్న కొద్ది పాటి వ్యవసాయ భూముల్లో కాలువ పనులు చేపడితే మేమెలా బతకాలని, మాభూములు కాలువ నిర్మాణంలో పోకుండా చూడాలని ఎమ్మెల్యేను భూ నిర్వాసితులు దండం పెట్టి వేడుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే తుర్కలపల్లి సమీపంలో ఉన్న సారగట్ల మైసమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా మండలంలోని సిర్సనగండ్ల సీతారామ చంద్రస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ పలు ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు.



తమ భూములను కాపాడాలని ఎమ్మెల్యేకు దండం పెట్టి కోరుతున్న గిరిజన మహిళ

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

మండల కేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో జీహెచ్ఎం భగవాన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయిపూలే జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో ఇసాక్‌హుసేన్, ఎంఈవో ఝాన్సీరాణి, ఎంపీవో వెంకటేష్, ఆర్ఐ భరత్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జమ్మికింది బాలరాంగౌడ్, మాజీ జడ్పీటీసీ భీముడు నాయక్, మాజీ ఎంపీటీసీ గ్యార లక్ష్మణ్, శంకర్ గౌడ్, జైపాల్, శ్రీపతిరావు, సహదేవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ బాక్స్

క్రీడలతో మానసికోల్లాసం

» అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



సమావేశంలో మాట్లాడుతున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అయిజ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలోని తిక్కవీరేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా సావిత్రీబాయి జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడాకారులుగా ఎదిగితే స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అయిజ మునిసిపల్ చైర్మన్ చిన్నదేవన్న, కౌన్సిలర్లు సురేశ్, అంజనేయులు, శ్రీరాములు, నాయకులు, చిన్న హనుమంతు, సంకాపురం రాముడు, మల్లికార్జున్‌రెడ్డి, భద్రయ్య, రంగారెడ్డి, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడా రంగానికి ప్రభుత్వం పెద్ద పీట

» జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సరిత



విజేత జట్టుకు కప్ అందిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

గట్టు (గద్వాల) జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జోగుళాంబ గద్వాల జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత అన్నారు. గట్టు మండల పరిధిలోని మాచర్ల గ్రామంలో నిర్వహించిన ఓపెన్ టు ఆల్ వాలీబాల్ టోర్నమెంట్ ముగిసిన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఫైనల్ మ్యాచ్‌ను తిలకించారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు సరిత బహుమతిని అందించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు మాజీ సర్పంచు ధనలక్ష్మి, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు ఆనంద్, నాలుగవ స్థానంలో నిలిచిన జట్టుకు అరగిద్ద బాలకృష్ణనాయుడు బహుమతులను అందించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరితను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆర్. తిరుమలేశ్, నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ గౌస్, ఆనంద్‌గౌడు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువతి మృతి



అంజలి (ఫైల్)

ఉప్పునుంతల, జనవరి 3 : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండలం, పూర్యనాయక్ తండాలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మూడవత్ దేవ్లా, లక్ష్మి దంపతులు మూడవ కుమార్తె అంజలితో కలిసి కొన్నాళ్ల క్రితం బతుకు దెరువు కోసం అచ్చంపేటకు వచ్చారు. పట్టణ సమీపంలోని ఓ కోళ్ల ఫారంలో పని చేస్తూ అక్కడే నివసిస్తున్నారు. ఈ క్రమంలో గత శనివారం అంజలి (18) పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె, పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందింది. యువతి ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. ఆమె ప్రేమించిన యువకుడు గత నెలలో ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

780 కిలోల నల్లబెల్లం స్వాధీనం

కల్వకుర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణ పరిధిలోని తండాల్లో నల్లబెల్లం, నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జేపీనగర్ తండా, భగత్‌సింగ్ తండా, రాంనగర్ తండాల్లో శుక్రవారం ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 780 కిలోల నల్లబెల్లం, 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. రెండు వందల లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ వివేక్, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన విద్యార్థిని

పదర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలోని ఓ కళాశాల నుంచి గురువారం అదృశ్యమైన విద్యార్థినిని పోలీసుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌వో ఉమాదేవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెండు వారాల నుంచి సెలవులో ఉన్న ఆమె, గురువారం మధ్యాహ్నం తరువాత తల్లితో కలిసి కళాశాలకు వచ్చింది. తల్లి వెళ్లిన కొద్ది సేపటికి విద్యార్థిని కళాశాల నుంచి బయటకు వెళ్లిపోయింది. అమ్రాబాద్ మండలంలోని లక్ష్మాపూర్‌లోని వరుసకు చిన్నమ్మ ఇంటికి చేరుకున్నది. విషయాన్ని తెలుసుకున్న కళాశాల సిబ్బంది గ్రామానికి వెళ్లి విద్యార్థినిని తీసుకొచ్చారు. తల్లిదండ్రులను పిలిపించి, కానిస్టేబుళ్లు సరిత, ప్రశాంత్‌ల సమక్షంలో అప్పగించారు.





గోపాల్‌పేట మండలం చెన్నూరు శివారులోని పొలంలో నాటేందుకు నారు తీసుకొస్తున్న రైతులు, నాట్లు వేస్తున్న మహిళా కూలీలు, రైతులు

యాసంగి సాగు షురూ

వనపర్తి జిల్లాలో జోరందుకున్న వరి నాట్లు

» 1.50 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని అంచనా

» కూలీలకు రెండు నెలల పాటు ఉపాధి » వర్షాకాలంలో 1.96 లక్షల ఎకరాల్లో సాగు



మూలమల్ల గ్రామంలో కాడెద్దులతో కరిగెట చేస్తున్న రైతులు

ఆత్మకూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : యాసంగి సాగు పనులు మొదలయ్యాయి. నారు పోసుకొని, కరిగెట దున్ని సిద్ధం చేసుకున్న రైతులు వరి నాట్లు ప్రారంభించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో వనపర్తి జిల్లాలో బోర్లు, బావులతో పాటు, ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల కింద 1.50 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ప్రియ దర్శిని జూరాల ప్రాజెక్టుతో పాటు, పలు ఎత్తిపోతల పథకాలు, రామన్‌పాడు రిజర్వాయర్ ఉండటంతో అధిక శాతం మంది రైతులు వరి సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో జిల్లా వ్యాప్తంగా 1.96 లక్షల ఎకరాలకు పైగా వరి సాగయ్యింది. వాతావరణం కూడా సహక రించింది. దీనికి తోడు సన్న రకాలకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో ఎక్కువ మంది రైతులు వరి సాగు చేసి, అధిక లాభా లను ఆర్జించారు. ఆశించిన మేర వర్షాలు కురవడంతో ప్రస్తుతం బోరు బావులు, చెరువులు, రిజర్వాయర్లలో నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు యాసంగి సాగును కొంత ముందుగానే మొదలు పెట్టారు. నవంబర్ చివరి మాసం నుంచే నారు పోసుకున్నారు. అలాగే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా 20 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని అధికారులు ప్రకటించడంతో ఎక్కువ మంది రైతులు వరి సన్నరకాలు సాగు చేస్తున్నారు.

దూర ప్రాంతాల నుంచి కూలీలు

వర్షాకాలం సాగు ముగిసిన నాటి నుంచి వ్యవసాయ కూలీలకు పనులు లేక ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం యాసంగి సాగు ప్రారంభం కావడంతో కూలీలకు డిమాండ్ నెలకొన్నది. వారికి మరో రెండు నెలల పాటు ఉపాధి లభించనున్నది. జిల్లా వ్యాప్తంగా వరి నాట్లు ఒకే సారి మొదలు కావడంతో, గ్రామాల్లో మహిళా కూలీల కొరత నెలకొన్నది. దీంతో రైతులు దూర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించు కుంటున్నారు. వారితో ఎకరం పొలంలో నాట్లు వేయించేందుకు ఐదువేల రూపాయల చొప్పున తీసు కుంటున్నారని రైతులు తెలిపారు. పొలం పనులు చురుగ్గా సాగుతున్నందున ఉదయం, సాయంత్రం వేళల్లో రైతులు, కూలీలతో గ్రామాలు సందడిగా కనిపిస్తున్నాయి. పంట పొలాలు కళకళలాడుతున్నాయి.

ఆర్టీసీ బస్సులో ప్రసవించిన మహిళ

» తల్లీబిడ్డలు క్షేమం



బస్సులో ప్రసవించిన మహిళను ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తున్న డ్రైవర్, కండక్టర్

కేటీదొడ్డి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని నందిన్నె గ్రామం దగ్గర శుక్రవారం ఓ మహిళ బస్సులో ప్రసవించింది. తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కేటీదొడ్డి మండలంలోని గువ్వలదిన్నె గ్రామానికి చెందిన నరేష్‌కు రాయచూరు జిల్లా బాయిదొడ్డి గ్రామానికి చెందిన మరియమ్మతో వివాహమైంది. మరియమ్మ శుక్రవారం ఆరోగ్య పరీక్షల కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడానికి బాయిదొడ్డి నుంచి గద్వాలకు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. నందిన్నె దగ్గరకు బస్సు రాగానే మరియమ్మకు పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. విషయాన్ని తోటి ప్రయాణికులు కండక్టర్, డ్రైవర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపివేసి బస్సులో ఉన్న వారందరినీ కిందకు దించాడు. కొంతమంది మహిళలు బస్సులోనే ఉండి మరియమ్మకు పురుడు పోశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని డ్రైవర్ నరేందర్‌గౌడ్, కండక్టర్ కిషోర్‌కుమార్ తెలిపారు. 108 అంబులెన్స్‌లో ధరూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహిళ ప్రసవానికి సహకరించిన డ్రైవర్, కండక్టర్, ప్రయాణికులను పలువురు అభినందించారు.

చోరీ అయిన ఆటో రికవరీ

గద్వాల క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని చింతలపేట కాలనీలో వారం రోజుల క్రితం చోరీ అయిన ఆటోను రికవరీ చేసినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతలపేట కాలనీకి చెందిన శ్రీనివాసులు గత నెల 24న రాత్రి ఇంటి ముందు పార్క్ చేసిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో పెబ్బేరు బస్టాండ్‌లో ఆటో ఉన్నదన్న సమాచారం మేరకు ఎస్ఐ కల్యాణ్‌కుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకొని పరిశీలించారు. రేవల్లి మండలానికి చెందిన బాలపీరు అనే వ్యక్తి ఆటోను దొంగలించినట్లు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. ఆటోను స్వాధీనం చేసుకొని నిందితుడిని జిల్లా కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

బాక్సింగ్‌లో మెరిసిన ఉడిమిళ్ల విద్యార్థి

పదర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలోని ఉడిమిళ్ల గ్రామానికి చెందిన భరత్ అండర్-16 బాక్సింగ్ 48 కిలోల విభాగం, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. గ్రామానికి చెందిన కుడిచేటి ఆనంద్, జ్యోతి దంపతుల కుమారుడైన భరత్ అచ్చంపేటలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించాడు. అతడిని ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

చెక్కు బౌన్స్ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

» రూ. 26.15 లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు

గద్వాల క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : చెక్కు బౌన్స్ కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీరామ ట్రాన్స్‌ఫోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్ (శ్రీరామ ఫైనాన్స్ లిమిటెడ్)కు సత్యారెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన చెక్కులు చెల్లలేదు. దీంతో శ్రీరామ ఫైనాన్స్ వారు కోర్టులో గద్వాల అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు దాఖలు చేశారు. ఈ కేసు శుక్రవారం విచారణకు వచ్చింది. శ్రీరామ ఫైనాన్స్ లిమిటెడ్ తరుపున న్యాయవాదులు రఘురాంరెడ్డి, ప్రదీప్‌కుమార్, డీకే రాజు, వెంకటేశ్ తమ వాదనలను వినిపించారు. ఇరుపక్షాల వాదోపవాదాలను విన్న అనంతరం నిందితుడు సత్యారెడ్డికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ. 26,15,000 లక్షలు చెల్లించాలంటూ న్యాయాధికారి ధారావత్ ఉదయ్‌నాయక్ తీర్పు వెల్లడించినట్లు న్యాయవాదులు రఘురాంరెడ్డి, ప్రదీప్‌కుమార్ తెలిపారు.

చిరుత దాడిలో రెండు గొర్రెలు మృతి

కొత్తపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : చిరుతపులి దాడిలో రెండు గొర్రెలు చనిపోయాయి. నారాయణపేట జిల్లా కొత్తపల్లి తండాకు చెందిన మాజీ సర్పంచ్ భీక్యానాయక్ పొలంలో గురువారం రాత్రి ఈ సంఘటన జరిగింది. మండలంలోని నిడ్జింత గ్రామానికి చెందిన గోవిందప్ప, నీలప్పలకు సంబంధించిన గొర్రెల మందను భీక్యానాయక్ పొలంలో ఆపారు. అర్ధరాత్రి సమయంలో చిరుతపులి దాడి చెసి రెండు గొర్రెలను చంపేసింది. గమనించిన కాపరులు పెద్దగా కేకలు వేయడంతో చిరుత పులి పారిపోయింది. ఈ సంఘటనపై అటవీశాఖ అధికారి లక్ష్మణ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా నందిపాడు, గుండుమాల్, దోరెపల్లి పరిసర ప్రాంతల్లో చిరుత పులులు సంచరిస్తున్నట్లు తెలిపారు. పొలాలకు వెళ్లే రైతులు, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుత పులి పశువులు, గొర్రెలను చంపితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. తాము విచారణ చేపట్టి పరిహారం బాధితులకు అందిస్తామని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

» ఇద్దరికి రూ. 2,500 జరిమానా

నాగర్‌కర్నూల్ క్రైం, వంగూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురికి జైలుశిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు. నాగర్ కర్నూల్, వంగూరు ఎస్ఐలు గోవర్ధన్, మహేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది డిసెంబరు 31న అర్ధరాత్రి శ్రీపురం చౌరస్తాలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో తాడూరు మండలం ఇంద్రకల్‌కు చెందిన నాగరాజుగౌడ్, గోపాల్‌పేట మండలంలోని పుల్కపాడు గ్రామానికి చెందిన మల్లయ్య మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్షతో పాటు, రూ. 2500 జరిమానా విధిస్తూ జిల్లా ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి పుట్ట మౌనిక తీర్పు వెల్లడించారు. అలాగే వంగూరు మండల పరిధిలోని మిట్టసదగోడు గ్రామానికి చెందిన మేకల బాలయ్య గత సంవత్సరం డిసెంబరు 17న మద్యం తాగి ట్రాక్టర్ నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు, శుక్రవారం కల్వకుర్తి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

పోలీసు పహారాలో గ్రామసభ

» అభివృద్ధి పనులపై చర్చకే పరిమితం



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు, హాజరైన గ్రామస్థులు

ఖిల్లాఘణపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని మల్కిమియాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం పోలీసు పహారా మధ్య గ్రామ సభ నిర్వహించారు. ఇటీవల పల్లె ప్రకృతి వనంలో చెట్ల నరికివేతను గ్రామస్థులు అడ్డుకోవడం, భూ ఆక్రమణలపై రెండు వర్గాల మధ్య వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎనిమిది మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామ సభలో ముందుగా గత సంవత్సరం నిర్వహించిన అభివృద్ధి పనులు, కేటాయించిన నిధులకు సంబంధించిన నివేదికను గ్రామ కార్యదర్శి రాజు చదివి వినిపించారు. అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. అనంతరం గ్రామ అభివృద్ధి పనులపైనే చర్చ కొనసాగించారు. మొత్తానికి గ్రామ సభ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

పీయూలో భవనాల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి

» ప్రిన్సిపల్ సెక్రటరీతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో ఇంజనీరింగ్, లా కళాశాల భవనాల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎడ్యుకేషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్‌ను కోరారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్పలతో కలిసి ఆయనతో మాట్లాడారు. పీయూలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంజనీరింగ్, లా కళాశాలలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చి, త్వరితగతిన పనులు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి ప్రిన్సిపల్ సెక్రటరీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కరిగెటలో పడి కూలీ మృతి



హనుమంతు (ఫైల్)

ఖిల్లాఘణపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పొలంలో పని చేస్తూ ఓ కూలీ కరిగెటలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలో శుక్రవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మండల కేంద్రం నుంచి పర్వాతాపూర్ రోడ్డు సమీపంలోని పొలంలో వరి నాట్లు వేసేందుకు కౌలు రైతు చెన్నయ్య శుక్రవారం కొందరు కూలీలను తీసుకెళ్లాడు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం కరిగెటలో పిండి వెదజల్లుతున్న మ్యాతరి హనుమంతు (45) ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. పక్క మడిలో నాట్లు వేస్తున్న కూలీలు గమనించి అతడిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య నర్సమ్మ, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జిల్లాలోనే ముందున్నాం

● కోస్గి ఎంపీడీవో శ్రీధర్



కోస్గి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశానుసారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో నారాయణపేట జిల్లాలోనే కోస్గి మండలం ముందుందని ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఎంతశాతం పూర్తయింది?

నారాయణపేట జిల్లాలోనే ముందున్నాం. ఇప్పటివరకు 95శాతం పూర్తయింది.

కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నారా?

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తయ్యాక ఉపాధి హామీ పనులు కల్పిస్తాం.

ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రణాళిక తయారుచేశారా?

ఇదివరకు ఉమ్మడి 26 గ్రామ పంచాయతీలకు సంబంధించి గ్రామాల్లో ఏయే పనులు చేపట్టాలో ప్రణాళికను తయారు చేశాం.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్నారా?

వారంలో మూడుసార్లు ఏదో ఒక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నాం. అన్ని పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం బాగానే అందుతోంది.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం ధాన్యం విక్రయానికి వచ్చింది. వివిధ రకాల ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాల్	గరిష్ట (రూపాయలలో)	కనిష్ట
వరి సోన	211.80	2,493	1,830
ఎర్రకందులు	2217.25	8,706	3,000
తెల్ల కందులు	455.21	8,721	6,000

న్యూస్ బాక్స్

రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోయిన వారితో సమావేశం

కోస్గి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సయ్యద్ పహాడ్ దర్గా వరకు రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోయిన వారితో శనివారం సమావేశం నిర్వహించనున్నామని మునిసిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఆర్డీవో, తహసీల్దార్, ఆర్అండ్‌బీ అధికారులు బాధితులతో మాట్లాడతారన్నారు. సమావేశానికి పట్టణవాసులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఎస్పీని కలిసిన అధికారులు

నారాయణపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ యోగేష్‌గౌతమ్‌ను జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ అధికారులు, అదనపు ఎస్పీ ఎండీ.రియాజ్ హుల్ హక్, ఆర్ఐ నరసింహ, ఆర్ఎస్ఐ రాములు, ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్యలు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కోస్గి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముశ్రీఫా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రామానికి చెందిన ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ చెక్కులు నిరుపేదలకు అండగా నిలుస్తోందని రఘువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, విద్యాసాగర్ తదితరులున్నారు.

పాఠశాలకు వాటర్ ట్యాంక్ వితరణ

మక్తల్‌రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని కాట్రేవ్‌పల్లి గ్రామంలోని పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన ఫారెస్టు బీట్ ఆఫీసర్ మల్లేష్ 1500 లీటర్ల వాటర్ ట్యాంకును అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం నర్సిరెడ్డి దాతను అభినందించారు. పాఠశాలకు అవసరమైన వస్తువులను అందించి పాఠశాల అభివృద్ధికి తోడ్పాడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, రాజేష్, పూజిత తదితరులున్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

మక్తల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్, డైరీని శుక్రవారం మక్తల్ మండల కేంద్రం వద్ద ఎంఈవో అనిల్‌గౌడ్ ఆవిష్కరించారు. తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగార్జున, మండల గౌరవ అధ్యక్షుడు నర్సిరెడ్డి, అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి రాకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దడవాయి సంఘం కమిటీ ఎన్నిక

నారాయణపేట టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం దడవాయి సంఘం కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా రమేష్‌తో పాటు మరి కొంత మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు.

మన వల్ల పదవులకు వన్నె రావాలి

» ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

» మక్తల్‌లో మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారం



మక్తల్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

మక్తల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మన వల్ల పదవులకు వన్నె రావాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మక్తల్ మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతనంగా పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయించి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. కొత్తగా నియామకమైన పాలక వర్గం కరీంనగర్ జిల్లా ముల్కనూరు మార్కెట్ కమిటీని సందర్శించాలని సూచించారు. అంతకుముందు పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రి జూపల్లితో కలిసి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, కుంభం శివకుమార్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, దేవరిమల్లప్ప, లక్ష్మారెడ్డి, గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా మార్కెటింగ్ కార్యదర్శి బాలమణి మార్కెట్ చైర్‌పర్సన్‌గా గవినోళ్ల రాధలక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్‌గా గణేష్‌కుమార్, పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

భూత్పూరు ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తాం

మక్తల్ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం మక్తల్ మండలం భూత్పూర్ ముంపు గ్రామ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తుందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంత్రి శుక్రవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి భూత్పూర్ ముంపు గ్రామాన్ని పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను చూసి చలించిపోయారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. తాను 24 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, కానీ ఇంతటి హృదయ విదారకర వాతావరణం ఉన్న గ్రామాన్ని చూడలేదన్నారు. గ్రామస్థుల ఓపికకు దండం పెడుతున్నామని అన్నారు. గ్రామంలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయో గుర్తించి, కుటుంబానికి 200 గజాలకు తగ్గకుండా 30 ఫీట్ల రోడ్డుతో కలిపి ఎంత స్థలం అవసరమో గుర్తించి భూసేకరణకు నోటిఫికేషన్ ఇవ్వాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలాన్ని ఆదేశించారు. ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌తో చర్చించి ఈ వారంలోనే భూత్పూరు ముంపు గ్రామంపై సమీక్ష చేయిస్తామని హామీ ఇచ్చారు.

రైతులను ఆదుకుంటాం

మాగనూరు : సంగంబండ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులకు జీవో 2013 ప్రకారం రైతులను ఆదుకుంటామని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. శుక్రవారం మాగనూరు మండలం నేరేడుగాం గ్రామంలో పర్యటించారు. సంగంబండ రిజర్వాయర్ కింద భాగంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ముంపు గ్రామ ప్రజలకు తొందరలోనే జీవోను విడుదల చేసి, ఆదుకుంటామని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. సీఎం మన ప్రాంత వాసే అయినందున గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాగనూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, మాజీ సర్పంచు అశోక్‌గౌడ్, విద్యాసాగర్, కురువ నాగప్ప, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సంగంబండ డ్యామ్ పరిశీలన

సంగంబండ డ్యామ్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి పరిశీలించారు. డ్యామ్‌ను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరగా, మంత్రి స్పందిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు.

ఆలయాల ఆస్తులు కాపాడేందుకు కృషి చేయాలి

» కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

» కోస్గిలో వేణుగోపాలస్వామి, శంభునిగుడి ఆలయాల కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



ఆలయ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అధికారులు

కోస్గి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆలయాల ఆస్తులు కాపాడేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో వేణుగోపాలస్వామి, మహదేవ శంభునిగుడి ఆలయాల నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. వేణుగోపాలస్వామి దేవాలయ చైర్మన్‌గా కృష్ణమూర్తి, మహదేవ శంభునిగుడి చైర్మన్‌గా సోమశేఖర్‌ను నియమించారు. వీరితో పాటు ఒక్కో ఆలయానికి నలుగురు సభ్యులను నియమించి వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయా ఆలయాల పూజారులుగా జయతీర్థాచారి, మఠం విశ్వనాథంను నియమించారు. నూతన కమిటీ సభ్యులను తిరుపతిరెడ్డి సన్మానించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయానికి పదుల సంఖ్యల ఎకరాల్లో భూములు ఉన్నాయని ఈ భూములను స్థానికంగా ఉండేవారు ఆక్రమించుకున్నారని అన్నారు. ఆక్రమణదారులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆలయ భూములు, వక్ఫ్ భూములు ఆక్రమిస్తే సహించబోమన్నారు. కార్యక్రమంలో కాడా అధికారి వెంకట్‌రెడ్డి జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, కౌన్సిలర్లు, తహసీల్దార్ శ్రీనివాసులు, దేవాదాయ శాఖ ఈవో రాజేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



కోటకొండ జడ్పీహెచ్ఎస్‌లో పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్/నర్వ/ధన్వాడ/ఊట్కూర్/కోస్గి రూరల్/మక్తల్/మాగనూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పేట మండలంలోని కోటకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసి మహిళా విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సామాజిక కార్యకర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం సునిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదేవిధంగా నర్వలోని బీసీ కమ్యూనిటీ హాల్ వద్ద జ్యోతిరావు పూలే చిత్రపటానికి బీసీ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాయికోడ్ గ్రామంలో సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే విగ్రహాలకు గ్రామస్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ధన్వాడలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సావిత్రిబాయి పూలే చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలతో నివాళ్లు అర్పించి, ఆమె సేవలను కొనియాడారు. సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త అని మత్స్యశాఖ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నీరటి నర్సిములునాయుడు అన్నారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊట్కూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. సంఘం అధ్యక్షుడు కొక్కు శంకర్, నాయకులు పాల్గొన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం కుసుమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోవిందప్ప, నాయకులు పాల్గొన్నారు.

కోస్గిలోని మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివరాములు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంఈవో శంకర్‌నాయక్ ఆ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు. అలాగే, మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.



ఊట్కూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహిస్తున్న గ్రామస్థులు

అదేవిధంగా, నారాయణపేటలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాదీగ్ర్ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో గెజిటెడ్ హెచ్ఎంలను, మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

మక్తల్ పట్టణంలోని కస్తూర్బాగాంధీ, సంగంబండ గురుకుల వెల్ఫేర్ పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. బీసీ సంఘం, అంబేడ్కర్ సంఘం, జ్యోతిరావు పూలే బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాగనూరులో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం యువజన అధ్యక్షుడు సగురం రమేష్ తదితరులు పాల్గొన్నారు. కొల్పూరు ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళ ఉపాధ్యాయులకు శాలువా, పూలమాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మురళీధర్‌రెడ్డి, హెచ్ఎం తిమ్మన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ



కలశం ఊరేగింపులో అయ్యప్ప భక్తులు

నారాయణపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటలోని సరాఫ్ బజార్ బసవేశ్వర దేవాలయం దగ్గర అయ్యప్పస్వామి 33వ మహా పూజ భజన సంకీర్తనల మధ్య శుక్రవారం వైభవోపేతంగా జరిగింది. అంతకు ముందు స్థానిక బారంబావి శివాలయం నుంచి కలశం ఊరేగింపు పురవీధుల వెంట కొనసాగుతూ బసవేశ్వర దేవాలయానికి చేరుకుంది. ఊరేగింపులో అయ్యప్ప స్వాములు స్వామి నామస్మరణ చేస్తూ నృత్యాలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తికి భజన సంకీర్తనల మధ్య విశేష పూజలు నిర్వహించారు. 18వ పాదం గురుస్వాములతో పాటు డీసీసీబీ జిల్లా మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులను శాలువాలతో సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

తొమ్మిదిన డిమాండ్ డేగా జరపాలి

నారాయణపేట టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జనవరి 9న డిమాండ్ డేగా జరపాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 2014 నుంచి వ్యవసాయ కూలీల వాస్తవ వేతనాలు తగ్గాయన్నారు. కనీస మద్దతు ధరను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థలు మోదీ పాలనలో నిర్వీర్యమయ్యాయన్నారు. సాగు భూములకు రైతు భరోసా ఒకేసారి ఇవ్వాలన్నారు. రైతు రుణమాఫీ సమగ్రంగా అమలు చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 200 రోజుల పని కల్పించి రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాము, రాంచందర్, యాదగిరి, రాజన్న, వెంకటయ్య, కొండారెడ్డి తదితరులున్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో ప్రొటోకాల్ రగడ

» జిల్లా విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

» అదనపు కలెక్టర్‌కు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



అదనపు కలెక్టర్ బెన్‌షాలంకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రొటోకాల్ రగడ జరిగింది. ప్రొటోకాల్ పాటించకుండా సీఎం, జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను అవమానపరిచారని.. ఫ్లెక్సీలో ఫొటోలు వేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తూ డీఈవో గోవిందరాజులుతో పాటు, విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బెన్‌షాలంకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం ఆధ్వర్యంలో నాయకులు ఫిర్యాదు చేశారు. విద్యాశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ఫొటోను బ్యానర్‌లో వేయకుండా అవమానపర్చడం, అదే విధంగా జిల్లా ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమం నిర్వహించడంపై వారు మండిపడ్డారు. వెంటనే విద్యాశాఖ అధికారులు ఫ్లెక్సీని మార్చి ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఏర్పాట్లు చేయడంతో కాంగ్రెస్ నాయకులు శాంతించారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు మారుతి, వెంకటేష్‌గౌడ్ ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

» డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి



క్రికెట్ జట్టు విజేతకు చెక్కు, షీల్డ్‌ను అందిస్తున్న కుంభం శివకుమార్‌రెడ్డి

నారాయణపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణపేట మినీ స్టేడియంలో చిట్టెం నర్సిరెడ్డి, చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డిల జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన అమార్ జవాన్ జట్టుకు ప్రథమ బహుమతి రూ.30 వేలు, సూపర్ సిక్సర్స్ జట్టుకు రెండవ బహుమతి రూ.20 వేలు, షీల్డ్‌ను కుంభం శివకుమార్‌రెడ్డి అందించి, ప్రసంగించారు. తాను యూనివర్సిటీ రోజుల్లో ఆడిన క్రీడలను గుర్తు చేసుకున్నారు. క్రీడాకారులకు కొత్త మైదానం ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి వేణుగోపాల్, గందె చంద్రకాంత్, సతీష్‌గౌడ్, డాక్టర్ సాయిబాబ, సూర్యమోహన్, కోట్ల మధుసూదన్‌రెడ్డి, వెంకుగౌడ్, గందె సుమిత్, నిర్వాహకులు ఉన్నారు.

ఏడో తేదీ నుంచి 30 వరకు సదరం క్యాంపులు

దామరగిద్ద, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈనెల ఏడో తేదీ నుంచి 30 వరకు సదరం క్యాంపులు నిర్వహించనున్నామని ఎంపీడీవో సాయిలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు మీసేవ కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు ఫోన్ మెసేజ్ తేదీ, స్లాట్ రశీదు, మెడికల్ రిపోర్ట్సు, ఆధార్‌కార్డు తీసుకొని పైన తెలిపిన తేదీల్లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని సూచించారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారితో పాటు రెన్యువల్ చేయించుకునే వారికి కూడా అవకాశం ఉందని, దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఊట్కూర్ ఆసుపత్రి పీఐవోకు మెమో జారీ

ఊట్కూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఊట్కూర్ ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన సమాచారం ఇవ్వాలని కోరుతూ సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న కే.నర్సిములుకు తగిన సమాచారం ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఊట్కూర్ ఆసుపత్రి సమాచార అధికారికి మెమో జారీ చేశారు. ఊట్కూర్ మండలం మగ్దూంపూర్ గ్రామానికి చెందిన సమాచార హక్కు చట్టం కార్యకర్త నర్సిములు ఆసుపత్రి బడ్జెట్, మెయింటనెన్స్ ఖర్చులు, బిల్లులు ఇవ్వాలని కోరుతూ రెండు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. చట్టం ప్రకారం 30 రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉండగా 69 రోజులైనా ఇవ్వకపోవడంతో జిల్లా అధికారికి అప్పీల్ చేసుకున్నాడు. దీంతో అడిగిన సమాచారం ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశిస్తూ మెమోను శుక్రవారం ఇచ్చారని నర్సిములు తెలిపారు.

డీటీని నియమించాలంటూ ధర్నా

మరికల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తహసీల్‌లో డిప్యూటీ తహసీల్దార్‌ను నియమించాలని శుక్రవారం సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ గతేడాది నుంచి డీటీ లేక యువకులు, విద్యార్థులు ఆదాయం, కులం సర్టిఫికెట్ల కోసం, అదేవిధంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీటీని నియమించే వరకు ఆందోళన కార్యక్రమాలు దశల వారీగా చేపడుతామన్నారు. స్పందించిన తహసీల్దార్ జమీల్ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

క్రీడల్లో ప్రతిభ చాటిన గిరిజన విద్యార్థులకు అభినందన

ధన్వాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడల్లో ధన్వాడ మండలం కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో 26 జట్లు పాల్గొన్నాయి. నారాయణపేట జిల్లా జట్టు తరపున కొండాపూర్ విద్యార్థులు కిషన్, గణేష్, శివకుమార్, మహేశ్, సతీష్, శ్రీను, గోపి పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో విద్యార్థులు కాంస్య పతకం సాధించారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ రాజారాం, పీడీ కోచ్ రాంమోహన్‌గౌడ్, పీఈటీ ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ సాంబయ్య, శ్రీనివాస్‌నాయక్‌లు అభినందించారు.

మైసమ్మ దేవాలయ అభివృద్ధికి కృషి

» భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి

దామరగిద్ద/నారాయణపేట రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మైసమ్మ దేవాలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దామరగిద్ద మండల కేంద్రంలో ఈనెల ఏడో తేదీన మైసమ్మ దేవాలయం బ్రహ్మోత్సవాల నేపథ్యంలో దేవాలయానికి పెయింటింగ్ నిమిత్తం ఆయన రూ.50 వేల చెక్కును దేవాలయ నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైసమ్మ దేవాలయంలో బ్రహ్మోత్సవాలు, జాతరకు ప్రతీ ఏటా తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అదేవిధంగా నారాయణపేట మండలంలోని లోకపల్లి లక్ష్మమ్మ దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయానికి వంట పాత్రలు ఇచ్చేందుకు గాను ఆయన అంగీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పూజారి సోమశేఖరశర్మ, కమిటీ అధ్యక్షుడు రాంబాబు తదితరులున్నారు.

కూలిన మార్కెట్ గోదాం

» యార్డులో ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు » పట్టించుకోని అధికారులు



కూలిన గోదాం

కృష్ణ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డు గోదాం కూలిపోయింది. గోదాం చుట్టూ ముళ్లకంపలు ఏపుగా పెరిగి లోపలికి వెళ్లడానికి దారి లేకుండా తయారైంది. మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని మార్కెట్ యార్డుకు అనుసంధానంగా దీనిని నిర్మించారు. మండల పరిధిలోని పల్లెల్లో వేరుశనగ, కంది, పెసర, పొద్దుతిరుగుడు తదితర పంటలు పండిస్తున్న రైతులు పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా కేంద్రంలోని గంజ్ వద్దకు వెళ్లి తమ ధాన్యాన్ని విక్రయించడాన్ని గుర్తించిన అప్పటి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యే ఎల్కోటి ఎల్లారెడ్డి, చిట్టెం నర్సిరెడ్డిలు మండల కేంద్రంలో సబ్ మార్కెట్ యార్డు గోదాంను ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం దీని నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో గోదాం బీటలు వారి కూలడానికి సిద్ధంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మార్కెట్‌యార్డు చుట్టూ ఉన్న ముళ్లచెట్లు తొలగించి బీటలు పడిన గోదాంను మరమ్మతులు చేయాలని మండల ప్రజలతో పాటు, రైతులు కోరుతున్నారు.